ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.12.02.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ రోజు అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం జరుగుతోంది.
2. పొరుగు రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం సూచించింది.
3. స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటా ఐచ్చికాన్ని తప్పని సరి చేసే అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహిస్తోంది.
4. హైదరాబాద్ లో మృత దేహానికి రెండు రోజుల పాటు చికిత్స అందించిన ఘటనపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్ విచారణకు ఆదేశించారు.

-----------------------------

**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరుగుతోంది. హైదరాబాద్ లోని కమాండ్ కంట్రోల్ భవనంలో జరుగుతున్న ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి

విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్; ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ హాజరయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై చర్చిస్తున్నారు. అలాగే ప్రభుత్వం తరఫు నుంచి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం చేయాల్సిన ఏర్పాట్లు, డెడికేటెడ్ బీసీ కమిషన్ సిఫారసుల ఆధారంగా ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లు, ఇతర అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

డెస్క్

---------------------

**స్థానిక సంస్థల ఎన్నికలు**

ఈ నెల 27న స్థానిక సంస్థల ఎన్నికలు జరగునున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధానాంశమైన రిజర్వేషన్లపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, ఇతర సిబ్బందికి పంచాయతీ రాజ్ శాఖ ఈ రోజు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇదిలా ఉండగా ఎన్నికల నిర్వహణపై వివిధ జిల్లాల కలెక్టర్లు పోలింగ్‌లో పాల్గొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణను అందిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈరోజు నుంచి 15 వరకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రానున్న స్థానిక సంస్థల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు.

**పీటీసీ, మంచిర్యాల, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి**

------------------------

**ఎమ్మెల్సీ ప్రచారం**

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం నిన్నటితో ముగియడంతో నిర్మల్ జిల్లాలో ప్రచారపర్వం జోరు అందుకుంది. నామినేషన్ వేసిన అభ్యర్థులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య ప్రచారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పలు సమావేశాలు కార్యక్రమంలో పాల్గొంటూ తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి పట్టభద్రుల అభ్యర్థిగా పోటీపడుతున్న ఉట్కూరి నరేందర్ రెడ్డి గత కొన్ని నెలలుగా జిల్లాలో వివిధ కార్యక్రమాల నిర్వహిస్తూ పట్టభపద్రుల స్థానానికి నామినేషన్ వేశారు. బీఎస్పీ నుంచి పులి ప్రసాద్ హరికృష్ణ వాట్సాప్ ఫేస్బుక్ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

**పిటిసి నిర్మల్ జిల్లా**

--------------------------

**బర్డ్ ఫ్లూ**

పొరుగు రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వ్యాధి విజృంభించడంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. కొన్ని రోజుల పాటు గు, కోడి మాంసానికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించింది. బర్డ్ ఫ్లూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పౌల్ట్రీ రైతులు, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యాధి సోకిన కోళ్ల రవాణాను అడ్డుకోవాలని, చనిపోయిన పక్షులను సరైన పద్ధతులు పాటిస్తూ పారవేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. అసాధారణమైన పౌల్ట్రీ మరణాలను గుర్తిస్తే పశువైద్యులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది దృష్టికి తీసుకు వచ్చేలా అవగాహన కల్పించాలని సూచించింది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ఉత్తర్వులు జారీ చేశారు.

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం చెక్ పోస్ట్ వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న వాహనాల తనిఖీ కొనసాగుతుంది. సూర్యాపేట జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేనప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ అంశంపై సూర్యాపేట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు ఆకాశవాణి తో మాట్లాడుతూ...

**----------సౌండ్ బైట్ ---------**

**డెస్క్, సూర్యాపేట**

-----------------------

**ఎన్నికల కమిషన్**

స్థానిక సంస్థలో నోటా ఐచ్చికాన్ని తప్పనిసరి చేయడంపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు గాను నోటాకు ఓటు వేసే పద్దతిని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రాలు పాటిస్తున్నాయి. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరైనా నచ్చకపోతే కనీసం నోటాకైనా ఓటర్లు ఓటు వేస్తారనే ఉద్దేశంతో ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. అయితే నోటాకు పోలైన ఓట్లు ఎన్నికలపై తగినంత ప్రభావం చూపించలేకపోవడంతో దీనిపై రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

**డెస్క్**

--------------------

**నాగార్జున సాగర్ నీటి విడుదల**

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువల ద్వారా అధికారులు నీటి విడుదల చేస్తున్నారు.. ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా 9 వేల 767 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8 వేల 718 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదారాబాద్ తాగునీటి అవసరాల నిమిత్తం 2 వేల 200 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా మరో 280 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అలాగే ప్రధాన విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 8 వేల 19 క్యూసెక్కుల నీటికి సమానమైన విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 542.20 అడుగులకు చేరింది.

మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మన్వాడ వద్ద ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో 20.39 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎల్ఎండీకు 2 వేల 500 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

**పిటిసి, నల్లగొండ, రాజన్న సిరిసిల్ల**

--------------------

**సింగరేణి**

సింగరేణి మనుగడకు సహకరించాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ కార్మికులకు సూచించారు. ఈ రోజు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రాంతంలోని పలు గనులను, ఓపెన్ కాస్టులను సందర్శించి కార్మికులతో మాట్లాడారు. ఈ ఏడాది లక్ష్యాలను సాధించాలంటే సింగరేణి గనులు ఉన్న అన్ని ప్రాంతాల్లో కలిపి రోజుకు కనీసం 2 లక్షల 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలన్నారు. కార్మికులపైన సంస్థ మనుగడ ఉంటుందన్న విషయాన్ని కార్మికులు గుర్తించాలని స్పష్టం చేశారు.

**పిటిసి, మంచిర్యాల జిల్లా**

-------------------

**విచారణ**

హైదరాబాద్ మియాపూర్ ఒక ఆసుపత్రిలో మృతదేహానికి రెండు రోజుల పాటు చికిత్స అందించిన ఘటనపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణకు మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాలంటూ అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ కడప జిల్లాకు చెందిన మహిళను నెల రోజుల క్రితం సిద్దార్థ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. ఆమె మరణించినప్పటికీ రెండు రోజుల పాటు చికిత్స అందించారు. బాధిత కుటుంబ సభ్యులు అనుమానంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించగా మహిళ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు.

**పీఎస్**

---------------------

**మేడారం చిన్న జాతర**

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర ఈ రోజు ప్రారంభమైంది. రెండేళ్లకోసారి జరిగే మహాజాతర అనంతరం చిన్న స్థాయిలో జరిగే ఉత్సవం ఇది. మాఘశుద్ధ పౌర్ణమి నుండి నాలుగు రోజుల పాటు మేడారం జాతర సాగుతుంది. తొలి రోజు పూజారులు గద్దెలను శుద్ధి చేసి దిష్టి తోరణాలు కడతారు. గురువారం మండమెలిగే కార్యక్రమం, శుక్రవారం భక్తుల మొక్కుల చెల్లింపులు, శనివారం జాతర ఉంటాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం 5 కోట్ల 30 లక్షల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాకు చెందిన భక్తులు తరలివస్తారు.

**డెస్క్, ములుగు**

-------------------